# అందరి చూపు కారు వైపు

మానకొండూర్ నియోజకవర్గంలో అందరి చూపు కారుపైపే ఉన్నది. ఇప్పటికే వరుసగా రెండు సార్లు గెలిచి రికార్డు సృష్టించిన రసమయి బాలకిషన్ హ్యాట్రిక్ విజయం వైపు దూసుకెళ్తున్నారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఆయన గెలుపు కోసం కృషి చేస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మానకొండూర్‌ను అభివృద్ధి చేసిన ఆయన గెలుపు నల్లేరుపై నడకే అన్న విధంగా మారింది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు బలహీనంగా ఉండడం కూడా రసమయికి కలిసి వస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

**- కరీంనగర్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ)**

- **మానకొండూర్‌లో దూసుకుపోతున్న బీఆర్ఎస్**
- **హ్యాట్రిక్ దిశగా రసమయి**
- **ప్రతిచోటా బ్రహ్మరథం పడుతున్న జనాలు**
- **గెలుపు ధీమాతో కదులుతున్న బీఆర్ఎస్ శ్రేణులు**

తెలంగాణ ఉద్యమంలో ధూం ధాం కార్యక్రమంతో తన మాటా, పాటలతో ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మానకొండూర్ నియోజకవర్గ ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికల్లోనే అప్పటి ఉద్యమ నేత, ప్రస్తుత సీఎం కేసీఆర్ 2014 ఎన్నికల్లో రసమయి బాలకిషన్‌కు మానకొండూర్ టికెట్ కేటాయించి కళాకారుల పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఆయన ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్న రసమయి ఆ ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఆరెపల్లి మోహన్‌పై ఘన విజయం సాధించారు. అంతే కాకుండా, నియోజకవర్గంలోని ప్రజలకు చేరువగా ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రజల గుండెల్లో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్న రసమయికి 2018లో కూడా కేసీఆర్ తిరిగి టికెట్ ఇచ్చారు. కేసీఆర్ ప్రోత్సాహంతో ఆయన చేసిన అభివృద్ధి పనుల కారణంగా రెండో సారి కూడా రసమయి ఘన విజయాన్ని సాధించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన రసమయి నియోజకవర్గాన్ని శక్తి వంచన లేకుండా అభివృద్ధి చేసి చూపించారు.

### అభివృద్ధే ఆయన మంత్రం

ప్రత్యర్థులు ఎన్ని ఆరోపణలు చేసినా, అడ్డంకులు కల్పించినా లెక్క చేయకుండా మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమంపైనే రసమయి బాలకిషన్ దృష్టి పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. 2009లో ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఏర్పడిన మానకొండూర్ నియోజకవర్గానికి మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆరెపల్లి మోహన్ ప్రాతినిథ్యం వహించారు. అప్పుడు ఆయన ప్రభుత్వ విప్‌గా కూడా పని చేశారు. ఆయన హయాంలో అభివృద్ధికి నోచుకోని మానకొండూర్‌ను రసమయి బాలకిషన్ ఇప్పుడు అన్ని రంగాల్లో ముందు నిలిపారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఇచ్చిన అవకాశాన్ని ఆయన నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పూర్తి స్థాయిలో వినియోగించుకున్నారు. అభివృద్ధి, సం క్షేమం మాత్రమే తన లక్ష్యమని ముందుకు సాగా రు. మూడు జిల్లాల పరిధిలో ఉన్న నియోజకవర్గ ప్రజలను, నాయకులను ఏకతాటిపైకి తెచ్చి ముందుకు నడిపిస్తున్నారు. ప్రజల గుండెల్లో స్థిరపడిపోయిన రసమయిపై ప్రత్యర్థులు ఎన్ని ఎత్తు లు వేసినా తిప్పికొడుతూ ప్రజలు రెండుసార్లు ఆయన వైపే మొగ్గు చూపారు. ఈ ఎన్నికల్లో కూ డా ఆయనకు సరితూగే అభ్యర్థి కనిపించడం లేద ని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. మళ్లీ రసమయికే పట్టం కట్టాలనే లక్ష్యంతో కనిపిస్తున్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా కందికట్కూర్‌లో మహిళ లు, పార్టీ శ్రేణులతో మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

### ఎన్నికలప్పుడే ప్రజల్లోకి ప్రత్యర్థులు

రసమయి బాలకిషన్ మొదటిసారి ఎమ్మెల్యేగా నిలబడినప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యం ప్రజల మధ్యనే గడుపుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి పోటీలో ఉన్న నాయకులకు ఇందుకు భిన్నంగా ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుని నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడిగా రసమయికి పేరుంది. గతంలో ఏ ఎమ్మెల్యేను చూసినా ప్రభుత్వ లబ్ధిదారులను తమ వద్దకు పిలిపించుకుని ప్రయోజనాలు అందించే వారు. కానీ, రసమయి అందుకు భిన్నంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రైతుబీమా, గృహలక్ష్మి వంటి ప్రొసీడింగ్స్ అందించేందుకు రసమయి పొద్దుపొడుపు కార్యక్రమంతో ఆయా గ్రామాలకు వెళ్లి అందించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఇదే ఇప్పుడు అతనికి కొండంత బలాన్ని అందిస్తోంది. ఓట్లప్పుడే కాకుండా ప్రజల ఇంటికి వెళ్లి చెక్కులు, ప్రొసీడింగ్‌లు అందించిన విషయాన్ని ఇప్పుడు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇంత మంచి సేవ లు ఏ ఎమ్మెల్యే అందించలేదని, భవిష్యత్తులో వచ్చే నాయకులు కూడా ఈ విధంగా తమకు సేవ లు అందించ లేరని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు.

### దుష్ప్రచారాన్ని తిప్పి కొడుతూ..

రెండు పర్యాయాలు అంటే దశాబ్ద కాలంగా మానకొండూర్ నియోజకవర్గ ప్రజలకు తలలో నాలుకగా వ్యవహరిస్తున్న రసమయిపై ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని బీఆర్ఎస్ శ్రేణులు తిప్పికొడుతున్నాయి. ఆయన మరో సారి గెలుస్తున్నాడనే భయంతోనే ప్రత్యర్థులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పలువురు నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్యాకేజీల కోసం డిమాండ్ చేస్తున్న కొన్ని పత్రికలు అందుకు అంగీకరించని పక్షంలో తప్పుడు కథనాలు రాసి తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నాయని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి కథనాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మానకొండూర్‌లో హ్యాట్రిక్ విజయం సాధించేది రసమయి బాలకిషనే అనే విషయాన్ని వారు స్పష్టం చేస్తున్నారు.





WANTED




★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.

NT-314452

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





# కవ్వంపల్లి నోరు అదుపులో పెట్టుకో..

- **రాజకీయాలే జీవితం కాదు**
- **జీవితమే రాజకీయం కాదు**
- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ హితవు**
- **భారీ మెజార్టీతో రసమయి గెలుపు ఖాయమని స్పష్టం**
- **వ్యవసాయానికి ఏ మోటర్లు వాడుతారో రేవంత్‌కు తెల్వదని ఎద్దేవా**

మానకొండూర్ రూరల్, నవంబర్ 14 : ''కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ నోరు జారుతున్నారు. కొంచెం అదుపులో పెట్టుకోవాలి. రాజకీయాలే జీవితం కాదు జీవితమే రాజకీయం కాదు..'' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ హితవుపలికారు. మానకొండూర్ నియోజక వర్గం నుంచి రసమయి బాలకిషన్ మరోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుస్తాడని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం మానకొండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో ఇటీవలే చేరిన దరువు ఎల్లన్న, గడ్డం నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు. వారి సేవలను పార్టీకి, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ గెలుపు కోసం వినియోగించుకుంటామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రోజు రోజుకూ ప్రజల నుంచి ఆదరణ భారీగా పెరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ చేతిలోకి తెలంగాణ రాష్ట్రం పోతే కుక్కలు చింపిన విస్తరి అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ బావుల వద్ద 10 హెచ్‌పీ మోటర్లు ఉంటాయా?, వ్యవసాయానికి ఏ మోటర్లు పెడుతారో తెలియని రేవంత్‌రెడ్డికి సామాజిక పరిస్థితి కూడా తెలియదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గెలిస్తే పొలాల వద్దకు వెళ్లేందుకు టార్చిలైట్ పట్టుకొని వెళ్లే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. దాదాపు 60 ఏండ్ల కాంగ్రెస్ హయాంలో ఒక్క ఎస్సారెస్పీ కడితే, తెలంగాణ వచ్చినంక 20 రిజర్వాయర్లు కట్టామని గుర్తు చేశారు. 35 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చామని, 500 పడకల దవాఖానలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొవిడ్ లాంటి మహమ్మారి వస్తే కూడా రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అధునాతన పద్ధతిలో, మంచి నిష్ణాతులైన వైద్యులు, స్టాఫ్, సిబ్బంది ఉండేలా దవాఖానలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణాలో ఇప్పటి యువతకు కర్ఫ్యూ అనే పదమే తెలియదన్నారు. తెలంగాణ అంటేనే పచ్చదనమని, ఆర్థికంగా ఎదిగామని, ఇంకా చేయాల్సింది బాగా ఉందన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని తీసుకొచ్చి విద్యను అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్‌ను అందిస్తున్నామని, త్వరలో అన్ని పాఠశాలలను సెమీ రెసిడెన్సియల్‌గా మార్చుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు పడాల శంకరయ్య ఉన్నారు.

# ఒకరోజు ముందే అనుమతి తీసుకోవాలి

- **కరీంనగర్ జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఏ సతీశ్‌గణేశ్**

కలెక్టరేట్,నవంబర్ 14 : అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో భాగంగా రాజకీయ పార్టీలు, ఎమ్మెల్యే అభ్యర్థు లు ఎన్నికల ప్రచారం కోసం 24 గంటల ముందు అధికారుల నుంచి అనుమతులు విధిగా తీసుకోవాల్సిందేనని, కేంద్ర ఎన్నికల కరీంనగర్ జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఏ సతీశ్‌గణేశ్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకులు, జిల్లాలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఆయా సెగ్మెంట్ల రిటర్నింగ్ అధికారులకు గానీ, జిల్లా ఎన్నికల అధికారికి గానీ తెలపాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే అందుకు సంబంధించిన వీడియో, ఫొటోలు వాట్సప్ ద్వారా లేదా సంక్షిప్త సందేశం రూపంలో హిందీ, ఇంగ్లిష్‌లో పోలీస్ వ్యయ పరిశీలకులు ఏ సతీశ్‌గణేశ్ (9455717500), సాధారణ పరిశీలకులు డాక్టర్ సీఆర్ ప్రసన్న (9846442277), ఎం రవికుమార్(914837 4888), వ్యయ పరిశీలకులు శివ్‌శంకర్ (897707 3453), చిట్టె యోగేశ్ ఘుగ్దే (89770 34510)కు తెలియజేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదు దారుల పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. విదేశాల్లో విద్య, ఉద్యోగం కోసం వెళ్లిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం లేదని, పోలింగ్ రోజు నేరుగా వారి పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనన్నారు. పార్టీల ప్రచారాల అనుమతులు సువిధ పోర్టల్ ద్వారా ఆర్వోలకు రాతపూర్వకంగానైనా అందించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- **సాధారణ పరిశీలకుడు డాక్టర్ సీఆర్ ప్రసన్నకుమార్**

కలెక్టరేట్, నవంబర్ 14 : శాసన సభ ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని శాసనసభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సీఆర్ ప్రసన్నకుమార్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 30న జరుగబోయే అసెంబ్లీ సాధారణ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా నిర్వహించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలన్నారు. సూక్ష్మపరిశీలకులు పోలింగ్ సిబ్బందితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మేరకు పోలింగ్ బృందానికి తగిన సలహాలు, సూచనలు చేయవచ్చన్నారు. పోలింగ్ ఆరంభం నుంచి ముగిసేవరకు జరిగిన సంఘటనలన్నీ ఎప్పటికప్పుడు ఆయా నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్లకు తెలియజేయాలని సూచించారు. ఓటింగ్ అనంతరం ఓటరు తన ఓటు ఎవరికి వేశాననే రహస్యాన్ని బయటపెట్టకుండా చూడాలని, వారికి కేటాయించిన క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో వసతులు ఉండేలా చూడాలని వెల్లడించారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రానికి కళ్లు, చెవుల వంటి వారని, గతంలో జరిగిన హింసాత్మక సంఘటనలు, బెదిరింపులకు పాల్పడటం, నిర్ధిష్ట అభ్యర్థికి అనుకూలంగా అసాధారణంగా అధిక ఓటింగ్ జరగటం.. మొదలైన వాటి ఆధారంగా క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, స్టిల్‌ఫొటోగ్రఫీ, తదితర వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు పద్మావతి, సదానందం, ఎల్‌డీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.